సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 30 । జూన్ । 2025



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గుబ్బల హరిప్రియ (హైదరాబాద్) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆమెకు ఈఓ వీర్ల సుబ్బారావు అన్నదానం బాండ్ అందజేశారు.




8లో

దీనజనోద్ధరణలో జీజీహెచ్..

వివిధ రోగాల బారిన పడిన అనాథలను, అభాగ్యులను సంరక్షించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కాకినాడ జీజీహెచ్ ప్రత్యేక వార్డు ద్వారా సేవలందిస్తోంది.

కడలిలోకి 18,237 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 18,237 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,600, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేలు కలిపి 11,900 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

పింఛన్ ఇప్పించండి మహాప్రభో



మంగాయమ్మ

గోపాలపురం: పింఛను ఇప్పించాలంటూ 80 సంవత్సరాల వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన దొడ్డి చినబ్రహ్మయ్య సంవత్సరం క్రితం మరణించాడు. తన భర్త చనిపోయాడని, తనకు పింఛను ఇప్పించాలని గ్రామ స్థాయి అధికారులకు చినబ్రహ్మయ్య భార్య మంగాయమ్మ పలుమార్లు అర్జీలు పెట్టుకుంది. అయినప్పటికీ పట్టించుకున్న వారే లేరని.. తాను కూడా చనిపోయిన తర్వాత పింఛను ఇస్తారా అని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్నా పింఛనుకు ఆమె పెట్టుకున్న అర్జీలను ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తన మొర ఆలకించి, పింఛను ఇప్పించాలని మంగాయమ్మ వేడుకుంటోంది.

కోటసత్తెమ్మ సన్నిధిలో భక్తుల సందడి



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా దేవస్థానానికి రూ.1,76,321 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహుని సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలమ్ సాహ్ని ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద కమిషనర్ సాహ్నికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. వారికి స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదంను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందజేశారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, మండల ఆర్ఐ వి.రామరాజు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల్లో..
ఆ ఎమ్మెల్యేలు ఫెయిల్!

- ఏడాదికే పతనమైన గ్రాఫ్
- ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- రెడ్, ఆరెంజ్ జోన్‌లలో ఏకంగా 16 మంది
- రెడ్ జోన్‌లో 'జనసేన'దే సింహభాగం
- 'రైజ్' సర్వేలో వెల్లడి
- కూటమిలో హాట్ టాపిక్‌గా మారిన నివేదిక

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరగడం.. ఆ ఫలితాల్లో కొంత మంది పాసవడం, మరికొందరు ఫెయిలవడం అందరికీ తెలిసిందే. సరిగ్గా ఇదే రీతిలో.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధిక మంది ఎమ్మెల్యేలు కూడా వార్షిక పరీక్షల్లో ఫెయిలయ్యారు. ఇలా చెబుతున్నది ప్రతిపక్షమో, గిట్టనివారో అయితే కొట్టిపారేయొచ్చు. కానీ, ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దీనినే ఎమ్మెల్యేలకు వార్షిక పరీక్షగా భావిస్తే.. ఆయా నియోజకవర్గాల్లోని మెజారిటీ ప్రజలు వారికి పాస్ మార్కులు కూడా ఇవ్వలేదు. వారి పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కువ మందిపై ప్రజా వ్యతిరేకత

కూటమి సర్కారు పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల పరిపాలన తీరు, కార్యకలాపాలపై ఈ నెల 18న రైజ్ అనే సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో సమగ్ర సర్వే నిర్వహించింది. పనితీరు ఆధారంగా ఆయా ప్రజాప్రతినిధులకు గ్రేడ్‌లు (జోన్‌లు) ప్రకటించింది. అత్యంత అవినీతి, పాలనా వైఫల్యం, తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమైన నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను రెడ్ జోన్‌లో చేర్చింది. ఆ తరువాత కాస్త అటూ ఇటూ అయినా ఫర్వాలేదన్నట్టుగా ప్రజాభిప్రాయం వ్యక్తమైన ఎమ్మెల్యేలను ఆరెంజ్ జోన్‌లో.. బాగున్నారనే వారిని గ్రీన్ జోన్‌లో పేర్కొంది. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలోని మూడు వంతుల మందికి పైగా ఎమ్మెల్యేలకు మొదటి రెండు గ్రేడ్‌లే దక్కాయి. రైజ్ సంస్థ సర్వే నివేదిక ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అధికార కూటమి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



వీరు రెడ్ జోన్‌లో..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 21 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను రైజ్ నివేదిక రెడ్ జోన్‌లో చూపించింది. ఈ జాబితాలో కాకినాడ సిటీ (వనమాడి వెంకటేశ్వరరావు), కాకినాడ రూరల్ (పంతం నానాజీ), రాజానగరం (బత్తుల బలరామకృష్ణ), కొవ్వూరు (ముప్పిడి వెంకటేశ్వరరావు), రామచంద్రపురం (మంత్రి వాసంశెట్టి సుభాష్), రాజోలు (దేవ వరప్రసాద్), పి.గన్నవరం (గిడ్డి సత్యనారాయణ) ఉన్నట్లు వెల్లడించింది. అవినీతి, అక్రమ కార్యకలాపాలు, లిక్కర్ పర్సంటేజీలు, ఇసుక, మట్టి మాఫియాలకు ఈ నియోజకవర్గాలు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి. ఈ ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైందని సర్వే నివేదిక తేల్చింది. టీడీపీతో పోలిస్తే జనసేనకు చెందిన ఎమ్మెల్యేలే రెడ్ జోన్‌లో ఎక్కువగా ఉన్నారు. మొత్తం ఏడుగురు రెడ్ జోన్ ఎమ్మెల్యేలకు గాను నలుగురు ఆ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో తమకు ఆదరణ ఉందని జనసేన నేతలు గొప్పగా చెప్పుకొంటారు. కానీ, ఈ జిల్లాలోనే ఏడాది తిరగకుండానే ఆ పార్టీ ప్రతిష్ట, ఆ పార్టీ ఎమ్మెల్యేల గ్రాఫ్ అడ్డంగా పడిపోయింది.

రాష్ట్ర మంత్రుల్లో 10 మంది పనితీరు బాగోలేదని రైజ్ సంస్థ నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు చివరి స్థానం దక్కింది. ఆయన పైన, ఆయన అనుచరగణం పైన ఏడాదిగా అనేక ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో వివిధ పత్రికల్లో పతాక శీర్షికల్లో తరచుగా కథనాలు వచ్చేవి. ఇటువంటి ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో కూడా అనేకం వైరల్ అయ్యాయి.

ఇవీ కారణాలు

ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత పెరగడానికి రైజ్ సంస్థ అనేక కారణాలను పేర్కొంది. ప్రధానంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం.. చెలరేగిపోతున్న ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియా.. భూ దందాలు.. బదిలీలకు చేయి తడపందే కదలని ఫైళ్లు.. పైసలివ్వందే దక్కని పోస్టింగ్‌లు.. నచ్చని వారిపై వేధింపులు, కక్ష సాధింపు చర్యలతో కూటమి నేతలు, వారి అనుచరగణాలు అడ్డూ అదుపూ లేకుండా అక్రమాలకు పాల్పడుతూండటంతో ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిందని తెలిపింది. దీనికి ఇంటింటికీ రేషన్ సరఫరా నిలిపివేత, సెటిల్‌మెంట్ల వంటివి కూడా తోడయ్యాయి. వీటన్నింటి నేపథ్యంలో ప్రజాక్షేత్రంలో పలువురు ఎమ్మెల్యేలు ఏడాది తిరగకుండానే తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. తమ ఎమ్మెల్యేలపై ఇంత తక్కువ కాలంలోనే ప్రజల నుంచి ఇంతలా వ్యతిరేక వస్తుందనే విషయం ఊహించలేదని కూటమి పార్టీల సీనియర్లే తలలు పట్టుకుంటున్నారు.

ఆరెంజ్ జోన్‌లో 9 మంది..

రెడ్ జోన్‌లో ఉన్న ఏడుగురిని మినహాయిస్తే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరో తొమ్మిది నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. వీరిలో జనసేన నుంచి నిడదవోలులో గెలిచి, పర్యాటక శాఖా మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్ కూడా ఉన్నారని రైజ్ సంస్థ పేర్కొంది. ఆయనతో పాటు ప్రత్తిపాడు (వరుపుల సత్యప్రభ), అనపర్తి (నల్లమిల్లి రామకృష్ణారెడ్డి–బీజేపీ), జగ్గంపేట (జ్యోతుల నెహ్రూ), కొత్తపేట (బండారు సత్యానందరావు), ముమ్మిడివరం (దాట్ల బుచ్చిరాజు – ప్రభుత్వ విప్), పెద్దాపురం (నిమ్మకాయల చినరాజప్ప), రాజమహేంద్రవరం సిటీ (ఆదిరెడ్డి వాసు), తుని (యనమల దివ్య) కూడా ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. ఈ తొమ్మిది మంది పనితీరు అంతంత మాత్రంగానే ఉందని రైజ్ సంస్థ రూపొందించిన నివేదిక పేర్కొంది.

మోసం.. చంద్రబాబు నైజం

- జనం నమ్మరని తెలిసి వేషగాడి సాయంతో అధికారం
- వైఎస్సార్ సీపీ నేత చెల్లుబోయిన వేణు విమర్శ
- కొవ్వూరులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న వేణు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి తదితరులు

తాళ్లపూడి (కొవ్వూరు): మోసం చేయడం చంద్రబాబు నైజమని, మోసగాడిని జనం నమ్మరని తెలిసి, వేషగాడు పవన్ కల్యాణ్ సాయంతో అధికారంలోకి వచ్చి, ప్రజలను మళ్లీ మోసం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ వద్ద బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ నియోజకవర్గ స్థాయి కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేణు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు గొందే శ్రీనివాసరెడ్డి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎల్ఈడీ తెరపై చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో చూపించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, ఇసుక, మట్టి, మద్యం, మైనింగ్ ఇలా అన్నింటిలోనూ దోపిడీ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఎమ్మెల్యేలపై చంద్రబాబు కోప్పడ్డారంటూ పెద్ద కథనాలు ఇస్తారని అన్నారు. ప్రజల పట్ల వైఎస్సార్ సీపీకి బాధ్యత ఉందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, చంద్రబాబు మోసాలను జనంలోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, ఇచ్చిన మాట అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. 2019లో కూడా ఎన్నికలకు కేవలం ఆరు నెలల ముందు తూతూ మంత్రంగా పథకాలు అమలు చేసి, చేతులు దులుపుకొన్నారని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించారని గుర్తు చేశారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ, ఏడాది పాలన పూర్తయినా ఎన్నికల హామీలను చంద్రబాబు అమలు చేయని విషయాన్ని 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో ఇప్పటి నుంచే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటే 2029లో అధికారం మనదేనని అన్నారు. ఆఖరి ఆరు నెలల్లో ఏమీ చేయలేమని, ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండాలని పిలుపునిచ్చారు. మనం చేసిన మంచి, కూటమి నేతలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పథకాలు అమలు చేయలేదని అడిగితే నాలుక మందమని చంద్రబాబు అంటున్నారని, ఎవరి నాలుక మందమో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- మరింత పెరిగిన పొగాకు ధర
- కిలోకు గరిష్టంగా రూ.300కు చేరిక
- ఇప్పటి వరకూ రూ.642.93 కోట్ల పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: వారం రోజులుగా ధర స్వల్పంగా పెరుగుతూండటంతో పొగాకు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ నెల 22 వరకూ కిలో గరిష్ట ధర రూ.290 ఉండగా, 24న రూ.290, 25న రూ.291, 26న రూ.293, 27న రూ.296 వరకూ పెరిగి, శనివారం ఏకంగా రూ.300కు చేరింది. సగటు ధర కూడా స్వల్పంగా పెరగడంతో మార్కెట్‌పై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేలం కేంద్రాలకు బేళ్లు తక్కువగా తెస్తున్నారు. వేలానికి రోజుకు 5 వేల నుంచి 6,400 వరకూ బేళ్లు రాగా, రెండు రోజుల నుంచి ఆ సంఖ్య తగ్గింది. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్‌లోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1, 2 వేలం కేంద్రాలకు శనివారం 4,396 బేళ్లు అమ్మకానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 2,616 బేళ్లు కొనుగోలు చేయగా, 1780 బేళ్లు అమ్ముడుపోలేదని వివరించారు. ఒకవేళ ముందుముందు ధర పెరిగితే ఇప్పుడు అమ్ముకుంటే నష్టపోతామని రైతులు అంటున్నారు. ఏటా ముందుగా అమ్ముకుంటున్న రైతులు నష్టపోతూండగా, చివరిలో అమ్ముకుంటున్న వారు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

23.53 మిలియన్ల కిలోల కొనుగోలు

రాజమహేంద్రవరం రీజియన్‌లోని ఐదు వేలం కేంద్రాల్లో శనివారం నాటికి 77 రోజుల పాటు వేలం నిర్వహించారు. ఇప్పటి వరకూ రూ.642.93 కోట్ల విలువైన 23.53 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. దీనిలో ఉత్తర తేలిక నేలల (ఎన్ఎల్ఎస్) పొగాకు 22.48 మిలియన్ల కిలోలు, బ్లాక్ సాయిల్ (బీఎస్) పొగాకు 10,45,242 కిలోలు ఉందని బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఎన్ఎల్ఎస్ పొగాకు కిలోకు రూ.275.03, బీఎస్ పొగాకుకు రూ.236.95 చొప్పున సగటు ధర లభించింది. శనివారం నాటికి ఐదు వేలం కేంద్రాల్లో మొత్తం 1,82,703 బేళ్లు కొనుగోలు చేశారు. ఇందులో ఎన్ఎల్ఎస్ పొగాకు 1,75,025 బేళ్లు, బ్లాక్ సాయిల్ బేళ్లు 7,678 ఉన్నాయి. కిలోకు గరిష్టంగా రూ.300, కనిష్టంగా రూ.220, సగటున రూ.273.24 చొప్పున ధర లభించినట్టు ప్రసాద్ వివరించారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 7.31 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–1లో 7.87, జంగారెడ్డిగూడెం–2లో 7.42, కొయ్యలగూడెంలో 6.64, గోపాలపురం వేలం కేంద్రంలో 7.76 మిలియన్ల కిలోల చొప్పున విక్రయాలు జరిగాయని తెలిపారు.



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

కదలని లో గ్రేడ్ పొగాకు బేళ్లు

లో గ్రేడ్ పొగాకు అడిగే నాథుడు లేక రైతుల ఇళ్ల వద్ద నిల్వలు కదలని పరిస్థితి కనిపిస్తోంది. ఏటా 15 నుంచి 20 శాతం లో గ్రేడ్ పొగాకు ఉత్పత్తి అవుతుంది. ఈ రకానికి గత రెండేళ్లూ మార్కెట్లో డిమాండ్ ఏర్పడి, ట్రేడర్లు అధిక ధరకు కొనుగోలు చేశారు. గత ఏడాది మార్కెట్లో లో గ్రేడ్ పొగాకు కిలో రూ.270 పలికింది. ఈ ఏడాది ఇంత వరకూ లో గ్రేడ్ పొగాకును ట్రేడర్లు కొనుగోలు చేయలేదు. గత ఏడాది కొనుగోలు చేసిన లో గ్రేడ్ పొగాకు నిల్వలు సుమారు 10 మిలియన్ల కిలోలు ఇంకా ఆయా కంపెనీల వద్ద ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రకం పొగాకును కొన్ని కంపెనీలు మాత్రమే కొనుగోలు చేస్తాయి. ఈ ఏడాది 10 నుంచి 15 శాతం లో గ్రేడ్ పొగాకు పండినట్లు అధికారుల అంచనా వేస్తున్నారు.

కొబ్బరి ధరహాసం

- వెయ్యి కాయలకు రూ.21 వేలకు పెరిగిన రేటు
- కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో తగ్గిన దిగుబడులు
- మన కొబ్బరికి డిమాండ్

పెరవలి: కొబ్బరి కాయలకు మంచి ధర లభిస్తూండటంతో రైతులు, వ్యాపారులు ఖుషీగా ఉన్నారు. కొద్ది రోజుల కిందట జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళాతో మొదలైన కొబ్బరి ధరల పెరుగుదల నేటికీ కొనసాగుతూనే ఉంది. గతంలో నాణ్యతను బట్టి వెయ్యి కాయలకు రూ.5,500 నుంచి రూ.6,500 చెల్లించేవారు. అటువంటిది కుంభమేళా దగ్గర నుంచి కొబ్బరి ధర క్రమంగా పెరుగుతూ నేడు రూ.21 వేలకు పెరిగింది. కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మార్కెట్‌లో ఏకంగా రూ.22 వేలకు కూడా ధర ఎగబాకింది. దీంతో, ఇటు రైతులు, అటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దండిగా దిగుబడి

మన జిల్లాలో 8,979 హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయి. వీటితో పాటు చేలు, పుంత, చెరువు గట్లు, లంక భూముల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. పెరవలి మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, నడుపల్లి, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో 400 ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. కొబ్బరి తోటల్లో గతంలో ఎకరానికి ప్రతి దింపునకు 600 నుంచి 800 కాయలు వచ్చేవి. ప్రస్తుతం తోటలు ఆరోగ్యంగా ఉండటంతో 1,200 నుంచి 1,500 కాయల దిగుబడి వస్తోంది. గతంలో ధర ఉంటే దిగుబడి ఉండేది కాదు. ప్రస్తుతం దిగుబడితో పాటు మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో గిట్టుబాటు ధర కూడా లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఖండవల్లిలో కొబ్బరి కాయల రాశులు

మన కొబ్బరికి డిమాండ్ వచ్చిందిలా..

దక్షిణాదిలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు అనూహ్యంగా పడిపోయాయి. దీంతో, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని కొబ్బరికి డిమాండ్ వచ్చింది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ఎగుమతులు జరుగుతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి నిత్యం 400 నుంచి 500 లారీల వరకూ కొబ్బరికాయల ఎగుమతులు జరుగుతున్నాయి. గతంలో కొబ్బరి దింపు తీయండంటూ వ్యాపారుల చుట్టూ రైతులు తిరిగేవారు. నేడు రైతుల చుట్టూ వ్యాపారులు తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గతంలో 40 రోజులకు ఒక దింపు తీసేవారు. అటువంటిది ఇప్పుడు వ్యాపారులు రైతులకు ముందుగానే సొమ్ము చెల్లించి మరీ 30 రోజులకే కాయలు దింపుతున్నారంటే కొబ్బరికి ఏవిధంగా డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

రైతుకు రూ.15 వేల వరకూ..: కొబ్బరి కాయలు దించేవారు, పోగు చేసేవారు, మోత, ఒలుపు కూలీల ఖర్చులతో పాటు రవాణా వ్యయం గణనీయంగా పెరిగింది. దీంతో రైతులు సొంతంగా కాయలు దించి, మార్కెట్‌కు తరలించాలంటే పెద్ద మొత్తంలో ఖర్చయ్యేది. ఇప్పుడు కొబ్బరికి డిమాండ్ ఏర్పడటంతో రైతులకు ఎటువంటి ఖర్చులూ లేకుండా వ్యాపారులే నేరుగా తోట వద్దకే వచ్చి ఒక్కో కాయ రూ.13 నుంచి రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. దింపు, మోత, రవాణా, ఒలుపు వంటి ఖర్చులన్నీ వ్యాపారులే భరిస్తున్నారు. అదే రైతు దింపు తీసి, ఒకచోట గుట్టగా పెట్టితే నాణ్యతను బట్టి కొబ్బరి కాయకు రూ.16 నుంచి రూ.17 వరకూ చెల్లిస్తున్నారు. మొత్తం మీద రైతులకు వెయ్యి కాయలకు రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకూ ధర దక్కుతోంది.

మా పంట పండింది



గతంలో ఇటువంటి ధరలు ఎప్పుడూ చూడలేదు. వ్యాపారులు చేల వద్దకే వచ్చి దింపు తీసుకుని, వెయ్యి కాయలకు నాణ్యతను బట్టి రూ.13 వేల నుంచి రూ.15 వేలు చెల్లిస్తున్నారు. కొబ్బరికి డిమాండ్ ఏర్పడటంతో మా పంట పండింది.

– కంటిపూడి సూర్యనారాయణ, రైతు, తీపర్రు

వ్యాపారులే వస్తున్నారు



గతంలో వ్యాపారుల చుట్టూ మేం తిరిగే వాళ్లం. అటువంటిది నేడు వ్యాపారులే మా చుట్టూ తిరుగుతున్నారు. గత పదేళ్లలో ఇంత ధర ఎప్పుడూ చూడలేదు. దిగుబడి బాగుంది. గిట్టుబాటు ధర కూడా లభిస్తోంది.

– నందమూరి నారాయణరావు, రైతు, తీపర్రు

వచ్చింది వచ్చినట్టు..



కొబ్బరికి డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాల్లో కాయల దిగుబడి తగ్గడంతో ప్రస్తుతం ఈ ధరలున్నాయి. ఇలా ఎంత కాలం ఉంటాయో తెలీదు. అందుకే కొబ్బరి కాయలు నిల్వలు వేయటం లేదు. వచ్చింది వచ్చినట్టు మార్కెట్‌కు తరలిస్తున్నాం.

– అడబాల బ్రహ్మయ్య, కొబ్బరి వ్యాపారి, అన్నవరప్పాడు

నేడు పీజీఆర్ఎస్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా, డివిజన్ మండల స్థాయిల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ యథావిధిగా నిర్వహించనున్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ప్రజలు 1100 నంబర్‌కు ఫోన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, ఇప్పటికే నమోదైన అర్జీ స్థితిగతులు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009 ద్వారా కూడా పౌర సేవలు పొందవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


అల్లిపర్ర కాలువలో సుబ్బారావు మృతదేహం

కాట్రేనికోన: మండలం గచ్చకాయలపోరకు చెందిన మత్స్యకారుడు మూదే సుబ్బారావు (55) ఆదివారం రాత్రి అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రాత్రి వేళ అల్లిపర్ర భూమికి చేపల వేటకు వెళ్లిన సుబ్బారావు ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. అల్లిపర్రకు వెళ్లే వరి కాలువలో అతడి మృతదేహం కనపడడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహంపై చేపల కోసం వేసిన వల, చేపలతో ఉన్న సంచి మొలకు ఉన్నాయి. సుబ్బారావుకు భార్య లక్ష్మి, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నాయి. గ్రామ పెద్దల సహకారంతో కుటుంబ సభ్యులు పోలీసులకు, తహసీల్దార్‌కు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓ శవ పంచనామా జరిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అవినాష్ తెలిపారు.

కొనసాగుతున్న దర్యాప్తు

కడియం: మండలంలోని కడియపులంకలో సుమారు 320 కేజీల గంజాయిని వైజాగ్ నార్కోటిక్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కేసు మూలాలను ఛేదించేందుకు దర్యాప్తు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగింది. ఇక్కడి నుంచి లారీని కిరాయికి మాట్లాడుకున్న వ్యక్తితో పాటు, భోపాల్‌లో మొక్కలు దిగుమతి చేసుకునే రైతు, లారీ యజమాని తదితరులను ఇక్కడికి రప్పించి, వారి నుంచి వివరాలు సేకరించే పనిలో నార్కోటిక్స్ బృందం నిమగ్నమైంది. కాగా రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్‌పై గంజాయి, ఓపియం రవాణాకు సంబంధించి రెండు కేసులు ఉన్నట్లు, అలాగే తన సొంత ప్రాంతంలో గలాటా కేసు కూడా నమోదైనట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ప్రస్తుత కేసుకు సంబంధించిన అందరి కాల్‌డేటాను సేకరించి, భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసును మొత్తం నార్కోటిక్స్ బృందమే పర్యవేక్షిస్తోంది. ఇక్కడి పోలీసులను బందోబస్తు వరకు మాత్రమే పరిమితం చేసినట్లుగా చెబుతున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260


మేన్‌మేడ్ ఫ్లోర్ స్క్రబ్బింగ్ డ్రై అండ్ వెట్ మాబ్ యంత్రంతో ఐడీ వార్డును శుభ్రపరుస్తున్న సిబ్బంది

దీనజనోద్ధరణలో జీజీహెచ్..

- అనాథ రోగులకు ప్రత్యేకంగా ఐడీ వార్డు
- చేర్చేందుకు మానవత్వమే అర్హత
- డాక్యుమెంట్లతో పని లేదు
- కంటికి రెప్పలా కాచుకునే సిబ్బంది


స్నానం చేయించేందుకు ఆస్కారం లేని అనాథ శరీరాన్ని శుభ్రం చేస్తున్న ఎంఎన్‌వో చింతపల్లి వీరబాబు

కాకినాడ క్రైం: రోడ్డుపై వెళ్తున్నప్పుడు ఎందరో అనాథలు, అభాగ్యులు మన కంట పడతారు. వయసుతో తారతమ్యం లేకుండా అనారోగ్యంతోనో.. కదల్లేని అచేతన స్థితిలోనో కొందరుంటే, మానసిక ఆరోగ్యం క్షీణించి ఒంటిపై ఆచ్ఛాదన కూడా లేని దీనావస్థలో ఇంకొందరు తిరుగుతూ ఉంటారు. అటువంటి వారిని చూసి అయ్యో అనుకుంటాం. వారి దయనీయతని చూసి జాలిపడతాం. చేసేదేం లేక పండో, పదో చేతిలో పెట్టి నిట్టూరుస్తాం. చలించిపోయిన మనసుకి సర్దిచెప్పుకొని బరువెక్కిన హృదయంతో అక్కడి నుంచి బయల్దేరతాం. ఓ మారు వారినీ చూడు దేవుడా.. అంటూ మనసులో స్మరిస్తూ ఇంకెవరితోనో ఆ విషయాన్ని పంచుకొని దిగులు చెందుతాం. ఎక్కడ పుట్టారో.. ఎలా పెరిగారో.. ఎలా జీవించారో.. ఎంత ఉన్నతులో.. ఎంత పేదవారో.. ఎవరి ఆదరణకు నోచుకోక రోడ్డున పడ్డారో ఏవీ తెలియని ఎందరో ప్రాణాలు అసంపూర్తిగా తెల్లారిపోతుంటాయి.

మనసులో తడి ఉన్న **వారికి సమాజంలో** కొదవు లేదు. అభాగ్యులై **రోడ్ల వెంట అగమ్యగోచరంగా** తిరిగే వారిని చూసి **అయ్యో అని వదిలేయ**కుండా ఏదో చేయాలని చాలామంది అనుకుంటారు. కానీ ఆర్థిక, కుటుంబ, సామాజిక పరిస్థితుల రీత్యా ఏమీ చేయలేని అసమర్థత. సామాజిక బాధ్యతగా భావించి ఏదో ఒకటి చేయాలనే వారి కోసం కాకినాడ ధర్మాస్పత్రి బాసటగా నిలుస్తోంది. వారు ఎవరినైనా అభాగ్యులను తీసుకువస్తే చేర్చుకునేందుకు ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ఐడీ (ఇన్ఫెక్షియస్ డిసీజెస్) వార్డుగా నామకరణం చేసింది.

జీజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డు

జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఈ వార్డునే ఐసోలేషన్ వార్డు లేదా అనాథల వార్డు అని పిలుస్తారు. ఇక్కడ ఎనిమిది పడకలు, గాలి కోసం ఆరు ఫ్యాన్లు ఉంటాయి. పారిశుద్ధ్య సిబ్బంది, ఓ ఎంఎన్‌వో, ఓ ఎఫ్‌ఎన్‌వో రోగులను సంరక్షిస్తుంటారు. ఇద్దరు నర్సులు 24 గంటల పాటు నిరంతరాయంగా సేవలు అందిస్తారు. తరచుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రతి రోజు పీజీ వైద్యులు వార్డుకు వచ్చి రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుంటారు.

మానవత్వం చాలు

అనాథ, శారీరక, మానసిక అనారోగ్య బాధితులు, కుటుంబ సభ్యులు వదిలేసిన దీనులు, రోడ్లపై గాయాలు, పుండ్లతో ఉన్న ఒంటర్లు, గర్భం దాల్చి రోడ్లపై సంచరిస్తున్న అనాథ మహిళలు. బిడ్డలు వదిలేయగా ఇంట్లో మగ్గిపోతున్న అనారోగ్య బాధిత వృద్ధులు. తీవ్ర అనారోగ్యాలతో భిక్షాటన చేస్తున్న వారు, ఇలా ఎవరూ లేని, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు ఎవరినైనా ఐడీ వార్డులో చేర్చవచ్చు. వీరిని చేర్చేందుకు సామాజిక బాధ్యత, మానవత్వం ఉంటే చాలు. ఎటువంటి డాక్యుమెంట్లు అవసరం లేదు. ఆరోగ్య శ్రీ కార్డులే కాదు, కనీసం ఆధార్ కార్డుతో కూడా పనిలేదు. ప్రాంతం, కులం, ఆర్థిక స్థితిగతులను తెలిపే ఎటువంటి పత్రాలు అవసరం లేదు. ఆ మాటకొస్తే కనీసం బాధితుడి పేరు తెలియక పోయినా ఈ వార్డులో చేర్చుకుంటారు. చికిత్సలో ఉన్నంత వరకు వీరి సంరక్షణను ఆస్పత్రి చూసుకుంటుంది.

అద్దంలా ఐడీ వార్డు

అభాగ్యుల వార్డు కదా.. అధ్వానంగా ఉంటుందనుకుంటే పొరపాటే. ఈ వార్డు నిర్వహణ గమనిస్తే ఫ్లోర్లు కూడా అద్దంలా మెరిసిపోతుంటాయి. నిత్యం మూడు పూటలా ముగ్గురు సిబ్బంది ఐడీ వార్డును శుభ్రపరుస్తారు. ఫినాయిల్, సోప్ ఆయిల్, ఫ్లోర్ క్లీనర్లు, టస్కీ స్ప్రేలు, లెమన్ గ్రాస్ ఆయిల్‌ను ఇందుకు వాడతారు. దోమల నివారణకు మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేస్తారు. కిటికీలన్నీ మెష్‌లతో మూసి ఉంచుతారు. ప్రతి వారం బూజులు దులుపుతారు. మేన్‌మేడ్ ఫ్లోర్ స్క్రబ్బింగ్ డ్రై అండ్ వెట్ మాబ్ యంత్రంతో వార్డును శుభ్రంగా ఉంచుతారు.

దాతలూ.. దయ చూపండి

అనారోగ్యాలతో బతుకీడుస్తున్న అనాథల కోసం దాతలు ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. అక్కడ రోగులకు పండ్లు, వస్త్రాలు సమకూర్చాలనుకునే వారు జీజీహెచ్ సీఎస్‌ఆర్‌ఎంవోను 89192 61612 నంబరులో సంప్రదించవచ్చు. తాము చేయాలనుకున్న సేవా కార్యక్రమాన్ని నివేదించి అనుమతులు పొంది అనారోగ్య పీడిత అనాథల సేవలో తరించవచ్చు.

సిబ్బంది కాదు.. సేవకులు



రోగులను ఆప్యాయంగా చూసుకునే సొంతిల్లు వంటిది ఐడీ వార్డు. అక్కడి సిబ్బంది సేవా దృక్పథంతో రోగులను కంటికి రెప్పలా చూసుకుంటారు. మూడు పూటలా రోగులకు పోషకాహారం అందిస్తున్నాం. పారిశుధ్య నిర్వహణ, వార్డులను పరిశుభ్రంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వైద్య సేవల అనంతరం కోలుకున్న వారిని అనాథాశ్రమాలు, ప్రభుత్వ సామాజిక వసతి గృహాలకు సిఫార్సు చేస్తాం. అనారోగ్యంతో ఉన్న అనాథ రోగుల పట్ల ప్రజలు మానవత్వంతో వ్యవహరించి కాకినాడ జీజీహెచ్‌కు తీసుకురావాలి. అత్యవసర విభాగంలో చేర్చి వైద్యుల సిఫార్సు మేరకు, ఐడీ వార్డు సహాయం కోసం అక్కడ నర్సులను సంప్రదించాలి.

– డాక్టర్ లావణ్యకుమారి,
సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

కన్నబిడ్డల్లా సాకుతున్నారు


అనాథ శరీరాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు ప్రభాకర్

ఐడీ వార్డులో రోగులు మలమూత్రాలన్నీ మంచం మీదే. అటువంటి వారి పక్కనూ.. వారినీ శుభ్రం చేస్తూ తన కన్న బిడ్డల్లా చూసుకుంటున్న పారిశుధ్య కార్మికుడు మీసాల ప్రభాకర్. కదల్లేని వారికి మంచం మీద.. నడవగలిగే వారిని మరుగుదొడ్లకు తీసుకువెళ్లి శుభ్రం చేసి తీసుకువస్తూ ఎంతో సేవ చేస్తున్నారు. శరీరం నిండా పుండ్లు, నిస్సత్తువతో ఉండే రోగుల ఆరోగ్య స్థితి మెరుగయ్యేందుకు నిత్యం రెండు సార్లు స్నానం చేయించి సపర్యలు చేస్తున్న ఎంఎన్‌వో చింతపల్లి వీరబాబు సేవలు సైతం చెప్పుకోదగ్గవే.


అనారోగ్య పీడిత అనాథకు ఇంజక్షన్ చేస్తున్న నర్సు వడ్డి ఇమ్మి

అమ్మలా నర్సు

ఐడీ వార్డులో అనాథ రోగులు చిన్నపిల్లల్ని మించి యాతన పెడుతుంటారు. సేవలు అందించే వారికి చుక్కలు చూపిస్తారు. వైద్యానికి ఏ మాత్రం సహకరించరు. అటువంటి స్థితిలో ఉన్నవారికి వడ్డి ఇమ్మి అనే స్టాఫ్ నర్సు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యం. అక్కడి రోగులందరూ ఆమెను సొంత మనిషిలా భావిస్తారు. నిస్సత్తువ ఆవహించి తడబడిన మాటలతో వారు పిలిచే అమ్మా అనే పిలుపు ఆమెకు వెయ్యి ఏనుగుల బలాన్నిస్తుంది. ఆమె సేవలను అక్కడి వైద్య, వైద్యేతర సిబ్బందితో పాటు వార్డును సందర్శించే అధికారులు, స్వచ్ఛంద సేవకులు ఎంతగానో గొప్పగా చెప్తుంటారు. కటకం నాగమణి అనే మరో నర్సు ఆమె అందిస్తున్న సేవల్లో పాలుపంచుకుని పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

ఒంటరి వృద్ధులే వారి టార్గెట్

- వారు మైనర్లు.. చేసేవి మేజర్ చోరీలు
- అడ్డంగా దొరికి జువైనల్ హోమ్‌కు..
- పోలీసుల అదుపులో ముగ్గురు బాలురు

అమలాపురం టౌన్: ఆ ముగ్గురూ మైనర్లు. ఒంటరి వృద్ధులే వారి టార్గెట్. వారినే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. కొత్తపేటకు చెందిన వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు చోరీలు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఇటీవల పట్టణం నల్లవంతెన, విత్తనాల వారి కాల్వగట్టు, పేరూరు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. గతంలో వీరు ముమ్మిడివరం, రాజమహేంద్రవరం, ఆత్రేయపురం, కడియం తదితర ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. 15 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న వీరి నేరాల చిట్టా పెద్దదే.

ఇదీ వారి చోరీల తీరు

ఒంటరిగా ఉన్న వృద్ధులను ఎంచుకుని, మాయ మాటలతో వారిని నమ్మించి ఆధార్ కార్డు, రూ.500 తీసుకుని వస్తే మీకు దగ్గరలోని సచివాలయాల్లో గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని మోసం చేస్తారు. వారు ఇళ్లలోకి వెళ్లగానే అదును చూసి వారి వద్ద డబ్బులు, బంగారు నగలు, వెండి వస్తువులు చోరీ చేస్తుంటారు.

సొత్తు స్వాధీనం

పట్టణ పోలీసులు ఆ ముగ్గురి మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన నేరాలు ఒక్కొక్కటిగా వివరించారు. వారి నుంచి రూ.40 వేలు నగదు, పది గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, 8 గ్రాముల బంగారు నల్లపూసల దండ, మూడున్నర గ్రాముల బంగారు చెవి దిద్దులు (ఒక జత), 110 గ్రాముల జత వెండి పట్టీలు, రెండు స్ప్లెండర్ మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జువైనల్ హోమ్‌కు తరలింపు

నేరాలకు పాల్పడిన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించిన పట్టణ పోలీసులు తొలుత రాజమహేంద్రవరం 3వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఆదివారం హాజరుపరిచారు. తర్వాత రాజమహేంద్రవరంలోని జువైనల్ హోమ్‌కు వారిని తరలించినట్టు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

- మహిళకు గాయాలు
- కారు టైరు మారుస్తుండగా ప్రమాదం

రంగంపేట: లారీఢీ కొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మహిళ గాయపడినట్టు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు గ్రామానికి చెందిన చెరుకూరి సత్యనారాయణ (51) శనివారం రాత్రి తన అల్లుడి కారులో పల్లకడియం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి పెద్దాపురం వెళ్తున్నారు. కారు వడిశలేరు శివారు నారాయణపురం వద్దకు వచ్చే సరికి టైరులో గాలిపోవడంతో ఏడీబీ రోడ్డు పక్కన కారు ఆపి అల్లుడు టైరు మారుస్తున్నారు. ఇంతలో కారు పక్కన నుంచున్న చెరుకూరి సత్యనారాయణను రాజానగరం నుంచి రంగంపేట వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ కుడికాలు తొడ నుజ్జునుజ్జు కాగా, పక్కన ఉన్న కూతురు శ్రావణికి ఎడమ కాలుకు గాయమైంది. వెంటనే ఇద్దరినీ 108 వాహనంలో రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి సత్యనారాయణ మృతి చెందాడని, శ్రావణి చికిత్స పొందుతున్నదని తెలిపారు. సత్యనారాయణకు వరుసకు కుమారుడైన మద్దిపాటి వీర వెంకట చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సృజనాత్మక ఆవిష్కరణలు చేయాలి

- విద్యార్థులకు ప్రభుత్వ మాజీ సీఎస్ సమీర్‌శర్మ పిలుపు
- జీజీయూలో ముగిసిన జాతీయ సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సమీర్‌శర్మ

రాజానగరం: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేయాలని, తద్వారా అనేక మార్పులను సాధించవచ్చని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ అన్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ సహకారంతో స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి 58 మంది మేధావులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు పాల్గొని సమకాలీన అంశాలపై చర్చించారు. భూమిపై పరిమితంగా ఉన్న వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ముంబైకి చెందిన ప్రొఫెసర్ చేతన్ సోలంకి 'పర్యావరణ మార్పుల' పై, రసాయనశాస్త్ర ఇంజినీర్ ఆచార్య జీడీ యాదవ్ 'గ్రీన్ హైడ్రోజన్' పై అవగాహన కలిగించారు. చాన్సెలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ప్రొ చాన్సెలర్ కె.శశికిరణ్‌వర్మ, వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొ వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ దర్శనానికి భక్తుల బారులు


మరిడమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు


మరిడమ్మ ఆలయం వద్ద భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్న ఈఓ


పూజలందుకుంటున్న మరిడమ్మ తల్లి

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం మరిడమ్మ తల్లి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి భక్తులకు సౌకర్యాలు చేపట్టారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు ఎస్‌ఐ మౌనిక ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. ఏటా నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

ఘనంగా చేపల వీధి సంబరం

స్థానిక చేపల వీధి సంబరం అంబరాన్నంటింది. భారీ సంఖ్యలో భక్తులు వీధి సంబరంలో పాల్గొని సందడి చేశారు. కోలాటం, మ్యూజికల్ నైట్, కాళికా వేషాలు, దేవతామూర్తుల వేషధారణలు, భారీ విద్యుద్దీలంకరణల మధ్య వైభవంగా నిర్వహించారు.

ఆయురారోగ్యాల్లో మునగంగా!

- ఆషాఢంలో మునగ వంటకాలకు ప్రాధాన్యం
- ఎన్నో విశిష్టతల మహోన్నత మాసం


జొన్నాడ గౌతమీ గోదావరి వద్ద మబ్బులు కమ్మిన ఆకాశం



ఆలమూరు: తొలకరి జల్లులతో ప్రకృతి శోభను తీసుకువచ్చే ఆషాఢ మాసానికి చారిత్రాత్మకమైన ప్రత్యేకత ఉంది. శుభప్రదమైన ఈ మాసంలో శుభకార్యాలు లేకపోయినా ఆధ్యాత్మికతతో కూడిన సందడి ఉంటుంది. హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ఈ మాసం ప్రతీకగా నిలుస్తోంది. గ్రామీణులకు ఆరాధ్యులైన గ్రామ దేవతలకు జాతరలు, నైవేద్యాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఆకాశంలో మేఘావృతమయ్యే మబ్బులు, పిడుగు పాటు శబ్దాలు, చిరుజల్లులతో ఆహ్లాదకరమైన వాతావరణం ఈ మాసం సొంతం. ఆషాఢమాసంలో లభించే నేరేడు పండ్లు, తాటికాయలు తదితర పోషక పదార్థాలు చక్కటి ఆరోగ్యాన్ని ఇస్తాయి. ప్రకృతి సిద్ధంగా లభించే లేత మునగాకుతో తయారు చేసే ప్రత్యేక వంటకాలు సువాసనలు వెదజల్లుతూ ఉంటాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ మాసంలో ఆదివారం వస్తే ప్రతి ఇంట్లో మునగాకు పప్పు లేదా తెలగపిండి మునగాకు కూర చేసుకుని తినడం రివాజుగా మారిపోయింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకం ఇటువంటి సంప్రదాయాలు నేటికీ కొనసాగిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆషాఢ మాసం అందరికీ ఇష్టమైనప్పటికీ నవ దంపతులకు మాత్రం ఈనెల రోజులు ఎడబాటుకు కారణమవుతుంది. నాటి సంప్రదాయాలతో పాటు భావి తరాలు, ఆరోగ్య పరిరక్షణ కోసం శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మికతతో ఆరోగ్య సూత్రాలను మిళితం చేసి ఆహార నియమాలను ఏర్పాటు చేశారని పండితులు చెబుతుంటారు.

ఆఫర్ల హంగామా కూడా ఈ నెలలోనే

ఆషాఢం వస్తోందంటే కార్పొరేట్ స్థాయికి చెందిన ప్రముఖ వస్త్రాలయాలు, జ్యూయలరీ సంస్థలు ఇచ్చే ఆఫర్ల కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారు. నేటి యువతరం ఆషాఢ మాసంలో వచ్చే ఆఫర్ల గురించి తెలిసినంతగా ఈ నెల విశిష్టత గురించి తెలుసుకోకపోవడం శోచనీయమని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మునగాకు వంటకాలు తప్పనసరి

ఆషాఢ మాసంలో మునగాకును తప్పనిసరిగా తినడతం వల్ల అనేక ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. ఇలా ఆషాడంలో మునగాతో కలిపిన కూరలు తినడం వల్ల ఒంటికి వేడి చేసి వర్షాకాలంలో కురిసే వర్షాలకు చలువ చేసే ఒంటిని సమ శీతోష్ణ స్థితిలో ఉంచుతుందని ఆయుర్వేద వైద్యులు చెప్తున్నారు. వర్షాకాలంలో మునగాకు లేతగా దొరకతుండటంతో తినడానికి అనుకూలంగా ఉంటుంది. దీని వల్ల ఒంటికి ఎన్నో పోషక విలువలు అందుతాయి. అస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులను కూడా నివారిస్తుంది. అలాగే మునగాకు బాలింతలకు, గర్భిణులకు అవసరమయ్యే విటమిన్ ఎ అందించి కంటి సమస్యలను నివారిస్తుందని ప్రకృతి వైద్యులు చెబుతుంటారు. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఇచ్చే ఈ మునగాకు కొంచెం చేదు, వగరు రుచుల కలగలిపి ఉండటంతో మహిళలు ఎక్కువగా కందిపప్పు, పెసరపప్పు తదితర వాటితో వంటకాలు చేసి వాడుతుంటారు. మరి కొంతమంది శ్రేష్టమైన నువ్వులతో తయారైన తెలగపిండితో మునగాకును కలిపి కూర చేసుకుని తింటారు.